అవగాహన సదస్సు

జిన్నారం (పటాన్‌చెరు): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ దశరథ్ పేర్కొన్నారు. గుమ్మడిదల పట్టణ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి మధుకర్ బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో కమిషనర్ మాట్లాడుతూ... కాలానుగుణంగా వ్యాప్తిచెందే వ్యాధుల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, నిత్యం చేతులు శుభ్రం చేసుకోవడం.. డ్రైడే వంటి అంశాలపై ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఫైలేరియా నిర్మూలనలో ఆగస్టు 10 నుండి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు .కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి రుద్రాక్షలతో అలంకారం



రాయదుర్గం: మాస శివరాత్రిని పురస్కరించుకొని ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్ ఆలయంలో చంద్రమౌళీశ్వర స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల సమక్షంలో రుద్ర హోమం నిర్వహించారు. అలాగే గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని గణపతికి అభిషేకం చేశారు. అనంతరం కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాక్షలతో అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మికులకు కిట్ల పంపిణీ



రక్షణకిట్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం అందజేసిన రక్షణ కిట్లను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల శుభ్రతతో పాటు కార్మికులు వారి ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించిన సేఫ్టీ కిట్లను ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా చెత్త, వ్యర్థాలు రోడ్లపై, ఎక్కడపడితే అక్కడ వేయకుండా కార్మికులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, ఎస్ఎఫ్ఏ వెంకటరెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్ : డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ నుండి దీప్తిశ్రీనగర్ వెళ్లే రోడ్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం నారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు.

21 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం....మంగళవారం నిర్వహించిన డ్రైవ్‌లో 21 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, ముగ్గురికి రూ .2 వేలు,మరో 13 మందికి రూ. 1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

వానొస్తే మునకే..



చందానగర్‌లోని ఓ షాపింగ్‌కాంప్లెక్స్ సెల్లార్‌లో చేరిన వరద నీరు (ఫైల్)

- అపార్టుమెంట్ల సెల్లార్లు, ఇళ్లలోకి చేరుతున్న వరదనీరు
- మునుగుతున్న అండర్‌పాస్‌లు, రోడ్లు
- ఇక్కట్లు పడుతున్న కాలనీవాసులు, వాహనదారులు



మియాపూర్ విశ్వనాథ్‌గార్డెన్- ప్రశాంత్‌నగర్ రోడ్డులో ఏర్పడ్డ గుంతలు



గచ్చిబౌలి: వర్షం వస్తే చాలు హైటెక్ ప్రాంతం వణుకుతోంది. అపార్టుమెంట్ల సెల్లార్లు, ఇళ్లలోకి వరద నీరు చేరుతుండడం.. అండర్‌పాస్‌లు, రోడ్లపై నీరు నిలుస్తుండడంతో ప్రజల పాటుల చెప్పనలవి కాదు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో వర్షాకాలం నానా హైరానా పడాల్సి పరిస్థితి. తాజాగా ఫ్లైఓవర్‌పై కూడా నడుములోతు నీరు చేరడం చర్చనీయాంశం గా మారింది. నగరంలో ఎక్కడా లేని విధంగా శేరిలింగంపల్లిలో ఫ్లైఓవర్లు ,లింకురోడ్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం, నాలా విస్తరణ, వరదనీటి కాలువల నిర్మాణం చేపట్టినా జంట సర్కిళ్లలో ఈ పరిస్థితి నెలకొనడం విస్మయానికి గురి చేస్తోంది. చిన్నపాటి వర్షం పడితే గంటల కొలది ట్రాఫిక్ సమస్యలు.. రోడ్లపైకి వచ్చే వరదనీరు మోకాళ్ల వరకు చేరడంతో వాటిని ఖాళీ చేయడానికి రెండు గంటల సమయం తీసుకుంటోంది. ఈ సమస్యకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలింద్ కాలనీలో..

శేరిలింగంపల్లి డివిజన్‌లో..

- కొండాపూర్ నుంచి గోపిచెరువుకు వెళ్లే వరద నీరు సుదర్శన్‌నగర్ మీదుగా వెళ్తుంది. సుదర్శన్ నగర్‌లో 15 ఏళ్ళ క్రితం నిర్మించిన డ్రైయిన్ ప్రస్తుత అవసరాలకు ఏమాత్రం సరిపోకపోవడంతో చిన్న వర్షం వచ్చినా నీరు రోడ్లపై చేరుతోంది
- సుదర్శన్‌నగర్ నుంచి ఆలింద్ ఎంప్లాయిస్ కాలనీ మీదుగా వెళ్లే వరదకు బాక్స్ టైప్ డ్రైన్‌ను నిర్మించి పైకప్పు వేశారు. దీంతో వరద మొత్తం ఆలింద్ ఎంప్లాయిస్ కాలనీ ముఖ ద్వారం వద్ద పెద్ద ఎత్తున నిలిచిపోతుంది. బాక్స్ టైప్ డ్రైన్‌లో పూర్తిగా చెత్త నిండిపోవడం, మంజీర లైన్ అడ్డుగా ఉండటం వలన చెత్త ఆగిపోవడంతో వరదనీరు మొత్తం రోడ్డుపైకి వస్తోంది.
- నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో వరద నీటితో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల నాలా డ్రైన్ పనులతో మట్టి కుప్పలను అక్కడే ఉంచడం వలన, భెల్ నుంచి వచ్చే వరద మార్కెట్ అండర్‌గ్రౌండ్ నుంచి వెళ్లాల్సి ఉన్నప్పటికీ అది పూడిపోవడంతో మార్కెట్‌లోకి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు.

చందానగర్, మియాపూర్‌లో..

- మియాపూర్‌లోని రామసముద్రం చెరువు ఆక్రమణలకు గురవడంతో చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా మట్టికట్టవేశారు. వరదనీరు చెరువులోకి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో వర్షపు నీరు కాలనీలోనే నిలిచిపోతోంది.
- మియాపూర్ గురునాథం చెరువు నుంచి పటేల్‌చెరువు వరకు నాలా విస్తరణ పనులు చేపట్టారు. ఈ పనులు కొద్దిరోజులుగా నిలిచిపోయాయి.
- నాలా విస్తరణకు నోచుకోకపోవడంతో భారీ వర్షాలు కురిస్తే ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీలోకి వరద నీరు చేరే అవకాశం ఉంది.
- దీప్తిశ్రీనగర్‌కాలనీ నుంచి పీజేఆర్ ఎన్‌క్లేవ్‌కు వెళ్లే రోడ్డులో వరదనీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

హఫీజ్‌పేట్ డివిజన్‌లో..

- వైశాలినగర్ లింకురోడ్డు, రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద .. జనప్రియనగర్ అపార్ట్‌మెంట్లు, చందానగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి ,రామకృష్ణానగర్, చిన్నం బాలాజీ టవర్స్ దీప్తిశ్రీనగర్ వంటి ప్రాంతాలలో సమస్యలు ఉత్పన్నవుతున్నాయి

గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ డివిజన్లలో..

- గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, కొండాపూర్, కొత్తగూడ, మాదాపూర్ ప్రాంతాలలో రోడ్లపైకి నీరు చేరుతుండడంతో వాహనదారులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది.
- దుర్గం చెరువు పరిసరాల్లోని పలు కాలనీలలో రోడ్లపైకి వరద నీరు చేరుతోంది
- నాలాల విస్తరణలో జాప్యం, అవసరమైన చోట వరదనీటి కాలువలు నిర్మించకపోవడంతో భారీ వర్షాలు కురిసినపుడు వరద వెళ్లే పరిస్థితి లేకపోవడంతో నానా ఇక్కట్లు పడాల్సి వస్తోంది.

వరదతో గుంతలు పడుతున్న రోడ్లు

- మియాపూర్‌లోని విశ్వనాథ్‌గార్డెన్ నుంచి ప్రశాంత్‌నగర్ రోడ్డు గుంతలమయంగా మారింది.
- హఫీజ్‌పేట్, ఆర్టీసీకాలనీ, చందానగర్ మీదుగా ఆర్‌సీపురం పోలీస్‌స్టేషన్ వరకు మంజీరా రోడ్డు నిర్మాణంలో జాప్యం కారణంగా వాహనదారులు నానా ఇక్కట్లు పడాల్సి వస్తోంది. దీనికితోడు వర్షం పడితే గుంతలు ఆపై బురదతో ప్రజల అవస్థలు చెప్పనలవి కాదు.

వర్షం వస్తే బీభత్సం



వర్షం వస్తే బయటికి వెళ్లే పరిస్థితి లేదు. కాలువపై కప్పు వేయడంతో దాంట్లో వ్యర్థాలు నిండి పోయి వరద నీరు రోడ్డుపైకి వస్తోంది. అదే విధంగా కొండాపూర్, హెచ్‌సీయూ నుంచి వచ్చే వరదను మళ్లించాలి.

–వెంకన్న, సుదర్శన్‌నగర్

వర్షాకాలం.. సెల్లార్ మునుగుతోంది



ప్రతి సంవత్సరం వర్షాకాలం మా అపార్ట్‌మెంట్ సెల్లార్ మునుగుతోంది. మా గదిలో ఉన్న సామగ్రి తడిసి పోయాయి. మదీనాగూడ రామకృష్ణనగర్‌లో వరదనీటికాలువ నిర్మించడంతో కొంతమేర ముంపు తప్పింది. కానీ మా వీధి మాత్రం ముంపునకు గురవుతుంది. వరద నీటి కాలువ నిర్మించాలి.

–వెంకటేశ్వర్లు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్, రామకృష్ణానగర్



మియాపూర్‌లో..

వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఉండాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్



కొండాపూర్‌లో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్

చందానగర్ : మియాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద, కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్, న్యూహఫీజ్‌పేట్ ప్రాంతాలలో ఉన్న వాటర్ లాగింగ్ పాయింట్‌లను హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగరంలో రోడ్లపై వరద నీరు భారీగా నిలిచిపోయింది. ఈ క్రమంలో మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు డీఈ శ్రీదేవి, ఏఈలను వాటర్ లాగింగ్ పాయింట్స్, మ్యాన్‌హోళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, హైడ్రా సిబ్బందితో జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు పడుతున్నప్పుడు మ్యాన్‌హోల్, వరద ముంపు ప్రాంతాల వద్ద జీహెచ్‌ఎంసీ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో హైడ్రా అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అతి రుద్రయాగం

ఆల్విన్‌కాలనీ: మాస శివరాత్రి సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లోని కాశీ విశ్వేశ్వరాలయంలో బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకిటి రామకృష్ణ ఆధ్వర్యంలో అతి రుద్ర యాగం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సతీష్‌రావు, వాకిటి మంజుల, సుమలత, రమేష్, కిరణ్‌శర్మ, పావని, శివ, రాజు, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

రాయదుర్గం: మహనీయులను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ సూచించారు. నానక్‌రాంగూడలోని పార్టీ కార్యాలయంలో బాలగంగాధర్‌తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి వరలక్ష్మీధీరజ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కిషన్, బబ్లూసింగ్, దినేష్‌యాదవ్, శ్యామ్ యాదవ్, ఉమేష్‌గౌడ్, గోపాల్, సామ్రాట్‌గౌడ్, సంకేష్‌సింగ్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 50, పచ్చిమిర్చి 70 , బెండ 50, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ).

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మియాపూర్ : చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని మదీనాగూడ దీప్తి శ్రీనగర్ కాలనీ బస్టాప్ సమీపంలో ఓ వ్యక్తి స్పృహతప్పి పడి ఉండడంతో స్థానికులు అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతని గురించి ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. కాగా చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడని వయస్సు సుమారు 70–75 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. గత కొన్ని రోజులుగా స్థానికంగా భిక్షాటన చేస్తూ ఇక్కడే ఉంటున్నాడని స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇంకుడుగుంత.. రాళ్లురప్పలు



జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. శేరిలింగంపల్లి సర్కిల్, జోనల్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఇంకుడుగుంత డస్ట్‌బిన్‌గా మారింది. భూగర్భజలాలు పెరగాలంటే ఇంకుడుగుంతల ఆవశ్యకతపై జీహెచ్‌ఎంసీ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తోంది. కానీ తమ కార్యాలయం ప్రధాన ద్వారం ముందు ఉన్న ఇంకుడు గుంత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం చూస్తుంటే చెప్పడం వరకే మాపని అన్నట్లు కనపడుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావునా ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంకుడుగుంతను పునరుద్ధరించాలని సూచిస్తున్నారు.

–శేరిలింగంపల్లి

హెచ్‌సీయూలో విద్యార్థుల నిరసన



హెచ్‌సీయూ పరిపాలనా భవనం ముందు విద్యార్థి సంఘాల నాయకుల నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిరసన తెలిపారు. హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ 2024–25 ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనకు ఎస్ఎఫ్ఐ, డీఎస్‌యూ, ఏఎస్ఏ, బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు మద్దతు ఇచ్చాయి. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ హెచ్‌సీయూలో వెంటనే శాశ్వత ప్రాతిపదికన సీఈని నియమించాలని, తాత్కాలిక సీఈతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆరోపించారు. అన్ని క్యాంటీన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక



ఫలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: తెలంగాణ సంస్కృతికి బోనాల పండగ ప్రతీక అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆషాఢమాసం పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమాలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమం అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్,మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'మనూ'లో ప్రవేశ పరీక్ష ఆధారిత కోర్సులకు అడ్మిషన్లు

రాయదుర్గం: మనూలో ప్రవేశ పరీక్ష ఆధారిత కోర్సులలో అడ్మిషన్లకు చివరి దశ సీట్లను జూలై 24న నిర్వహించేందుకు నిర్ణయించామని 'మనూ' అడ్మిషన్ల డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ బుధవారం తెలిపారు. 'మనూ'లో ప్రవేశ పరీక్షకు హాజరై అర్హత సాధించి మునుపటి జాబితాలో సీటు పొందలేకపోయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని పొందవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా ఆగస్టు 2న ప్రదర్శించబడుతుందన్నారు. ఫీజు చెల్లింపు తేదీ ఆగస్టు 2,3 తేదీలలో చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు అడ్మిషన్ల హెల్ప్ డెస్క్ నెంబర్ 040–23006612 ఎక్స్‌టెన్షన్ 1801 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు



మియాపూర్ : మియాపూర్‌లోని బోనాల ఉత్సవాల్లో భాగంగా ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డి. వెంకటేష్ గౌడ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే, కార్పొరేటర్లను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.